


# భోగరాజు నారాయణమూర్తి

1935-వ సం॥ జనవరి 1-వ తేదీని స్థాపించినది.

ఉద్యోగా ల్లేక తిరుగుతూ వున్నట్టిన్నీ వుద్యోగా లున్నప్పటికీ యే కారణం చేతనైనా మానుకోనే వుద్దేశంలో వున్నట్టిన్నీ ప్యాసు కాని పూర్వ పండితులూ, ప్యాసైన విద్వాన్లూ శిరోమణులూ మాత్రం దరఖాస్తులు పెట్టవలెను. వుద్యోగా ల్లేని యెమ్మేలూ బియ్యేలూ పెట్టే దరఖాస్తులు మా ఆఫీసులో బుట్ట దాఖలు చేయబడును. అన్ని విధాలా ప్రస్తుతం పండితుల దురవస్థ కనిపెట్టి, పండితులకేదేనా గత్యంతరం కల్పిద్దామన్న మహత్తర వుద్దేశంతో, కేవలం పండితులకొరకే మేమీ ట్రెయినింగు కాఫీక్లబ్బు స్థాపించాం. నిజంగా పండితు లీ కాలంలో అష్టకష్టాలూ పడుతున్నారు. ఆ అష్టకష్టాలూ యెలాంటివో అందరికీ తెలిసినవే. అయినప్పటికీ వొక్కొక్కటి మనవి చేస్తాం చిత్తగించండి! ఇందులో అసత్యం యేమేనా వుందేమో.

1. సాధారణంగా హైస్కూళ్లలో తెనుగు మేస్టరు పని ఖాళీ రావడమే చాలా అరుదు. అథవా యెక్కడేనా ఖాళీ వచ్చింది అంటే కొత్తగా ప్యాసయిన లేంగ్వేజస్ బియ్యేలూ యెమ్మేలూకూడా దరఖాస్తులు పడేస్తూ సిద్ధపడుతున్నారు. ఇది మొదటి కష్టం.

2. ఓరియంటల్ పరీక్షలు ప్యాసుకాని పూర్వ పండితులకు స్కూళ్లలో వుద్యోగాలివ్వకూడదని జి. వో. వొకటి తెచ్చి పెట్టేరు, ప్యాసయిన పండితుల కుద్యోగాలు మహా యిచ్చేస్తూన్నట్టు. ఇది రెండో కష్టం.

3. సాధారణంగా తెనుగు మేస్టరు అంటే పాఠశాలాధికారులకు గౌరవం తక్కువ. లేటుగా వచ్చినప్పుడు తక్కిన మేస్టర్లమీదకంటె పండితులమీద చకారగుళ్లు ప్రయోగించడంలో సురాకారం పాలు కాస్త జాస్తీగానే వుంటుంది. ఇది మూడో కష్టం.

4. పండితుల దురవస్థలు విచారించకుండా గోరు చుట్టుమీద రోకలి పోటులాగ—దుర్భిక్షంలో అధిక మాసంలాగ జిల్లాబోర్డువారు

జీతాలు కోసేశారు. ఇహ బోర్డుస్కూళ్ల పండితులు ఏకభుక్త వ్రతం ప్రారంభించవలసిందే. ఇది నాలుగో కష్టం.

5. ఆంధ్ర యూనివర్సిటీ పెట్టేసరికి హైస్కూళ్ల పండితుల జాతకాల్లో బుధయోగం మహా బాగా వుంది. కాని మరి కొంచెం కాలానికే శుక్రదశలో శుక్రుడు వక్రించడం చేత సెనేటు సభలో హైస్కూళ్ల పండితుల కియ్యబడిన స్థానం పుబ్బలో పుట్టి మఖలోనే మాడిపోయింది. ఇది ఐదో కష్టం.

6. S. S. L. C. పబ్లిక్ పరీక్షలలో పండితుడు సూపరింటెండెంటుగా వుండడానికి తగడట! ఆవిధంగానైనా నాలుగురాళ్లు పండితుడన్నవాడికి ముట్టకూడదట! సంవత్సరం పొడుగునా జరిగే క్లాసు పరీక్షల్లో మాత్రం వాచింగు సంసారం అంతా పండితుడిదే. అట్టి పరీక్ష రోజుల్లో యే మేష్టరు సెలవు పెట్టినా వాచింగు సామ్రాజ్యానికల్లా పండితుడే పట్ట భద్రుడు.

7. S. S. L. C. ఎగ్జామినర్సులో తెలుగు ఛీఫెగ్జామినరు పనికి ఇంగ్లీషు మేష్టరే కాని తెలుగు మేష్టరు పనికి రాడట! అతగాడికున్న యోగ్యతా విశేషాలు ఇతగాడికి లేవట! ఔను. నిజమే. పండితుడు సంవత్సరం మొదటి నుండీ టెక్స్టు బుక్కంతా ఆ మూలాగ్రంగా చదువుతూ మంచి మంచి ప్రశ్నలన్నీ జిహ్వాగ్రమం దుంచుకుంటాడు. కళా—ద్రుత ప్రకృతికం—సంధి—ఇత్యాది వ్యాకరణ కార్యాలు చెడకుండా తప్పులు లేని వాక్యాలతో ప్రశ్న పత్రం వ్రాసి యిస్తాడు. అలంకారమున్న పద్యంలోనే అలంకారమేదో వ్రాయమంటాడు కాని యే అలంకారం లేని పద్యం యిచ్చి యిందున్న అలంకార మేమని ప్రశ్నించడు. ఇంగ్లీషు మేష్టరే తెలుగు ఛీఫెగ్జామినరైతే యిలాంటి చిక్కులేవీ వుండవు. అందుచేత ఈ పదవి పండితుడన్నవాడికి స్వప్నంలోకూడా యివ్వరు. ఇది యేడో కష్టం.

8. ఛీఫెగ్జామినరు పనికి యోగ్యత లేకపోయినా ఎసిస్టెంటెగ్జామినరు పనికూడా తప్పకుండా వస్తుందన్న నిశ్చయం లేదు. పాతికేసేళ్ళు ముప్ఫయ్యేసేళ్ళు సర్వీసున్నవారుకూడా ఈ యెసిస్టెంటెగ్జామినరు పని జన్మానికల్లా శివరాత్రిలాగ వొక్కమారేనా పొందలేక జాతకాలు చూపించుకుంటూ యేటేటా సత్యనారాయణ వ్రతాలు చేసుకుంటున్నారు. ఇది యెనిమిదో కష్టం.

పండితులకున్న యీ అష్టకష్టాలూ పూర్తిగా దూరంగా విచారించే యీ ట్రెయినింగు కాఫీ క్లబ్బు స్థాపించినాము. ఇందులో సెనగచెట్లు కొబ్బరిచెట్లు ఇత్యాది చెట్లేలున్నా—రోస్టు పెసరట్—వుప్మా—ఇడెన్—పకోడీ—లాడూ—మొదలైన ఫలహారపు సామానులున్నా, కేసరీభాత్—వాంగీభాత్ మున్నగు చిత్ర విచిత్ర పదార్థాలున్నా యధావిధిగా తయారు చెయ్యడంలో విద్వాన్లకు శిరోమణులకూ మంచి ట్రెయినింగు ఇవ్వబడును. ఇందుకు తిరువళ్ళుత్తూరునుండి మ-రా-శ్రీ తైరువడా—వినాయకయ్యరుగారిని రప్పించి మా క్లబ్బులో పండితులకు ఇన్స్ట్రక్టరుగా ఎపాయింటు చేసినాము.

ఇహమీద పండితులంతా మా క్లబ్బులో అయ్యరుగారి ట్రెయినింగు పొంది తమ తమ

గ్రామాల్లో సొంత కాఫీ క్లబ్బులు పెట్టుకొని హాయిగా స్వతంత్రంగా జీవనం చేస్తూ వుండ గలందులకు మా క్లబ్బువారు హెచ్చరిస్తున్నారు. మా క్లబ్బులో ట్రెయినింగు కోర్సు పూర్తి కాగానే పరీక్షచేసి, యణాదేశసంధులూ వృద్ధి సంధులూ లాగ వాడుదుడుకులు లేకుండా సవర్ణదీర్ఘ సంధులులాగ సాఫుగా దోసెలు పొయ్యగలిగిన విద్వాన్లకు అయ్యరుగారి సంత కముతో సర్టిఫికెట్లియ్యబడును. శిరోమణులలో వేద శిరోమణులూ తర్క శిరోమణులు మాత్రం పెనందగ్గర కూర్చోడానికి పనికిరారు. వేద శిరోమణులు వేదాధ్యయనం చేసుకుంటూ ఇడ్లీన పిండి రుబ్బవచ్చును.

పండితు లందరూ తమ తమ దరఖాస్తులను 1935-వ సం॥ ఫిబ్రవరి 31-వ తేదీ దాటకుండా మా కార్యస్థానం చేరేటట్లు పంపవలెను.

---


# చిరకాలమునుండీ బాధించుచున్న మూత్రవ్యాధులకును శగ (గనేరియా) వ్యాధికిని క్రొత్తగా కనిపెట్టబడిన దివ్యౌషధము

# గొనోకిల్లర్ (రిజిష్టర్డు)

కృత్రిమములను జాగ్రత్త "కోడి మార్కు"ను చూచి కొనుడు.

ఈ ఔషధము ఇంగ్లీషు మందులను దేశీయ ఔషధములను పుచ్చుకొనినను గుణము కలుగనియెడలను, యింజక్షనులవలనను, వాక్సినులవలననుగూడ లాభము లేక పోయినయెడలను, కడపటిప్రయత్నముగా మా గొనోకిల్లరునుగూడ పుచ్చుకొని చూడుడు. పెక్కుయేండ్లనుండియున్నను లేక క్రొత్తగా కలిగినను ఏరకము శగ సంకటమైనను మరెట్టి మూత్రవ్యాధులైనను స్త్రీలకైనను పురుషులకైనను గొనోకిల్లరు తప్పక కుదుర్చును. మూత్రము ధారాళముగా వెడలును. మూత్రముపోవుచున్న పుడు కలుగు మంట తగ్గిపోవును. మూత్రనాళమునందలి వాపు తీసిపోవును. శగవ్యాధి (గొనోకోకసు) వలన మూత్రము బొట్టుగా పడుట, మేహరోగమువలన మూత్రద్వారమునుండి పోవు తెలుపు, మూత్రద్వారముయొక్క వాపు, మూత్రద్వారముయొక్క చుట్టు వుండు పోకయొక్క వాపు, మూత్రాశయముయొక్క వాపు లేక మూత్ర తిత్తియొక్క వాపు, నరముల జబ్బు మున్నగువ్యాధులన్నియును స్త్రీలకును పురుషులకునుగూడ గొనోకిల్లరువలన కుదురును. వీర్యము (సెమను) పోవుట, మూత్రవ్యాధులు మున్నగునవిగూడ దీనివలన కుదురును. ఖరీదు 50 మాత్రలు గల సీసా రు. 3—0—0. కృత్రిమములు చూచి భ్రమజెందవలదు. మా పుంజుమార్కు గమనింపుడు. వీ. పి. ఛార్జి ప్రత్యేకము. అడ్రసు:—డాక్టరు డి. యన్. జసాని, గిర్‌గాం వెనుకరోడ్డు, బొంబాయి, 4.

Dr. D. N. JASANI, Girgaon Back Road, Bombay, 4.
Madras Agents:—DADHA & Co., 52, Nainiappa Naick St., P. T., Madras.